సాక్షి సిద్దిపేట

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



ఓపెన్ స్కూల్ ఓ వరం

రెగ్యులర్‌గా చదవలేని వారికి ఓపెన్ స్కూల్ ఓ వరమని జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు.

8లో..



అణు విజ్ఞానంతో సరికొత్త అభివృద్ధి

దేశ, విదేశాల్లో ఇప్పటికే అణు విజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయ, వైద్య రంగాలలో సరికొత్త అభివృద్ధి సాధించారని బార్క్ యువ శాస్త్రవేత్తలు అన్నారు.

8లో..



అడ్మిషన్లు ఫుల్.. సౌకర్యాలు నిల్

హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసౌకర్యాలకు నిలయంగా మారింది. తాగు నీరు.. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

9లో..

న్యూస్‌రీల్

రుతుప్రేమపై అవగాహన



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గంలో చేపట్టిన రుతుప్రేమ కార్యక్రమం గురించి మహిళలకు వివరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం ఖాత, కొండంరాజ్‌పల్లి, ఘణపూర్ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల శారీరక సమస్యలు, సందేహాలను నివృతం చేసేందుకు గ్రామాల్లో వేదిక ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దశమంతరెడ్డి, పద్మ, రజిత, ఎంపీటీసీ ప్రియాంక పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న అధికారులు

హుస్నాబాద్: పట్టణంలో సోమవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సిబ్బందితో కలిసి పోలీసు అధికారులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి మల్లెచెట్టు చౌరస్తా, గాంధీ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి బైపాస్ రోడ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ సతీశ్ మాట్లాడుతూ ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నరేష్ కుమార్, సీఐ కిరణ్, ఎస్సైలు మహేష్, వివేక్, తిరుపతి, ఆర్ఏఎఫ్ ఇన్‌స్పెక్టర్లు మస్కర్, వీపీ రావు పాల్గొన్నారు.

కొలువుదీరిన ఏడుపాయల పాలకవర్గం



ఆలయం ఎదుట పాలకవర్గ సభ్యులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయలను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతానని నూతన పాలక వర్గ చైర్మన్ సాతెల్లి బాలాగౌడ్ అన్నారు. సోమవారం నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడారు. ఏటా రూ.6 కోట్ల ఆదాయం ఉన్న దుర్గమ్మ ఆలయ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మంజీరా నది చుట్టూ గెస్ట్ హౌస్‌లు నిర్మించి, శివరాత్రి జాతర ఘనంగా నిర్వహిస్తామన్నారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. డైరెక్టర్లుగా బాలాగౌడ్, శ్రీనివాస్ రావు, మాణెమ్మ, వెంకటేశం, సిద్ధిరాములు, పెంటయ్య, మోహన్‌రావు, దొడ్ల మనోహర్, సాయిలు, నాగభూషణం, రఘువీర్, యాదాగౌడ్, బాగారెడ్డి, చక్రపాణి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ పూజారి శంకరశర్మ ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

సిద్దిపేటరూరల్: సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సెకండ్ ఏఎన్‌ఎంలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పదిహేనేళ్లుగా పీహెచ్‌సీలలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కరోనా సమయంలో వారి సేవలను గుర్తించడం లేదన్నారు. తెలంగాణ వస్తే రెగ్యులర్ అవుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి బెక్కంటి సంపత్, బాలమణి, సరిత, వనజ, బాబామ్మ పాల్గొన్నారు.

ఆదేశాలు రద్దు చేయండి

సిద్దిపేటకమాన్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలు, మీడియాను అనుమతించవద్దని విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను వెనక్కు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, జనార్దన్ డిమాండ్ చేశారు. ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ సోమవారం సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నవీన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాట్లు.. పాట్లు

వరినాట్లకు కూలీల కొరత

- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న రైతులు
- తడిసిమోపెడవుతున్న ఖర్చు



ఫొటోలో కనిపిస్తుంది దుబ్బాకకు చెందిన రైతు మల్లుగారి నర్సింహారెడ్డి. తన పొలంతో పాటుగా ఇతరులది కౌలుకు తీసుకుని ప్రతీ సీజన్‌లో 30 ఎకరాలకు పైగానే వరి సాగు చేస్తుంటాడు. ఈ వానకాలంలో ఇప్పటికే 20ఎకరాలు నాటు వేయగా, ఇంకా 10 ఎకరాలు వేయాల్సి ఉంది. పొలం అంతా దున్నాడు. నారు కూడా సిద్ధంగా ఉంది. 15రోజులుగా నాటు వేసేందుకు స్థానికంగా కూలీలు దొరకడం లేదు. చేసేదేమీ లేక సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇతర గ్రామాల నుంచి ఆటోలో కూలీలను తీసుకొచ్చి నాటు వేయించాడు. ఇందుకోసం ఎకరాకు రూ.7500కు పైగా ఖర్చు అయింది. పైగా ముదిరిన నారు నాటు వేయాల్సి వచ్చింది. ఇది ఒక్క నర్సింహారెడ్డి సమస్య కాదు. జిల్లాలోని రైతులందరి పరిస్థితి ఇలాగే ఉంది.



వరినారు తీస్తున్న హుజూర్‌నగర్ కూలీలు

దుబ్బాకటౌన్: ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవడంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు వరి సాగులో నిమగ్నమయ్యారు. కానీ జిల్లాలో కూలీల కొరత ఏర్పడింది. 15 రోజులుగా కూలీలు దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. ఏ గ్రామంలో చూసినా వారికి చాలా డిమాండ్ ఏర్పడింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి నాట్లు వేయించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎకరానికి రూ.7వేలకు పైగా ఖర్చు

గతంలో ఎకరం నాటు వేసేందుకు రైతులకు రూ.5వేలలోపు మాత్రమే ఖర్చు అయ్యేది. ఈ వానాకాలంలో కూలీలకు డిమాండ్ పెరగడంతో ఎకరానికి రూ.7వేల నుంచి 8 వేల వరకు అవుతుంది. రోజుకు మహిళ కూలి రూ.350, పురుషుడికి రూ.700 ఇస్తున్నారు. కూలీల కొరతతో గ్రామాల్లో 10 నుంచి 20 మంది వరకు మహిళలు గుంపుగా ఏర్పడి గుత్తకు ఎకరానికి రూ.5500 నుంచి 6500 వరకు తీసుకుంటున్నారు. అలాగే ఆటో ఖర్చు రైతే భరించాలి. కూలీల కొరత కారణంగా సాగు పెట్టుబడి పెరుగుతుంది.

హుజూర్‌నగర్, బెంగాల్, యూపీల నుంచి కూలీలు

నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్‌తో పాటు యూపీ, బెంగాల్ రాష్ట్రాల నుంచి వరినాట్లు వేసేందుకు కూలీలు జిల్లాలోని పలు గ్రామాలకు వచ్చారు. వీరితోపాటు ఇతర గ్రామాల నుంచి కూలీలను తీసుకొచ్చి వరినాట్లు వేయిస్తున్నారు.

ముదురుతున్న నారు

కూలీల కొరతతో వరినారు ముదిరిపోతుంది. నారు ఎదిగిన తర్వాత 20 రోజుల నుంచి 40 రోజుల్లోపు నాటు వేయాలి. కూలీలు దొరకక చాలాచోట్ల 2 నెలలు దాటుతున్నా నాట్లు వేయకపోవడంతో నారు ముదురుతుంది. దానిని నాటు వేస్తే దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. దీంతో పైసలు ఎక్కువ ఇస్తామని కూలీలకు ఆశ చూపి తీసుకొస్తున్నారు. జిల్లాలో వందల మంది రైతులు ప్రతిరోజూ నాట్లు వేసే కూలీల కోసం తిరుగుతున్నారు.

1.80లక్షల ఎకరాల్లో వరినాట్లు

జిల్లాలో ఈ వానాకాలంలో రికార్డు స్థాయిలో 3.60లక్షల ఎకరాల్లో వరిసాగు అవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 1.80లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారు. గతేడాది వానాకాలంలో 3.30 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా, ఈ వానాకాలంలో 30 వేల ఎకరాల్లో వరిసాగు ఎక్కువగా జరుగుతుందనే అంచనాలో వ్యవసాయాధికారులు ఉన్నారు.

హుజూర్‌నగర్ కూలీలతో..



12 ఎకరాల్లో వరి సాగు చేశా. గతేడాది 20రోజులు తిరిగినా కూలీలు దొరకలేదు. చివరికి ముదిరిన నారు నాటు వేయాల్సి వచ్చింది. ఈసారి నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ నుంచి వచ్చిన కూలీలతో నాటు వేయించా.

–కేసుగారి స్వామి, రైతు

యంత్రాలు ఇవ్వాలి



ప్రభుత్వం నాటేసే యంత్రాలను సబ్సిడీపై రైతులకు అందించాలి. లేదంటే భవిష్యత్తులో వ్యవసాయం చేయడం కష్టం. ప్రస్తుతం నాటేసేందుకు కూలీలు దొరకక చాలా ఇబ్బంది పడుతున్నాం.

–ఎంగారి అశోక్‌రెడ్డి, రైతు

సాగు విస్తీర్ణం పెరిగింది



జిల్లాలో వరిసాగు విస్తీర్ణం పెరిగింది. కూలీల కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వరి కాకుండా ఇతర పంటలు కూడా సాగు చేయాలి. కొన్ని ప్రాంతాల్లో నాటువేసే యంత్రాలు వాడుతున్నారు. ఇప్పటికే వెదజల్లే పద్ధతిపై అవగాహన కల్పించాం. ఇప్పటికీ నాట్లు వేసుకునే సమయం మించిపోలేదు.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేస్తాం

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, ఇంటిపట్టాల పంపిణీ, జీఓ 59, నోటరీ, భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనారిటీల రూ.లక్ష సాయం, దళితబంధు పథకాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఎఫ్ఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 30 దరఖాస్తులు

అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రజావాణికి 30 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ)శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మతో కలిసి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు విన్నవించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ రెహమన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


పన్నెండేళ్లుగా కేజీబీవీల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా సిద్దిపేట అర్బన్ మండలం భూర్గుపల్లిలో దళితబంధు అర్హులకు అందకుండా కొందరు నాయకులు సంపన్నులకు కేటాయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆర్‌అండ్‌ఆర్ ముత్రాజ్‌పల్లిలో కేటాయించిన తన ఇంటిని గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ముంపుగ్రామమైన పల్లెపహాడ్‌కు చెందిన పోతుగంటి మల్లవ్వ ఫిర్యాదు విన్నవించారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

తల్లిపాలు అమృతంతో సమానం

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్



వైద్య విద్యార్థులు వేసిన పెయింటింగ్‌ను చూపుతున్న విమలాథామస్, కిషోర్‌కుమార్

సిద్దిపేటకమాన్: శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానమని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. సోమవారం జనరల్ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముర్రుపాలు పట్టించడం వల్ల బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఆరునెలలు వచ్చేవరకు తల్లిపాలు తాగించాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా మెడికల్ కళాశాల ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యార్థులకు తల్లి పాల ప్రాముఖ్యతపై క్విజ్, వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓలు డాక్టర్ హేమలత, సదానందం, చంద్రశేఖర్, పీడియాట్రిక్ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ వేణు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: ప్రజాయుద్ధనౌక, ప్రజా సమస్యలపై గళమెత్తిన గద్దర్ మృతి తీరనిలోటని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతానికి గద్దర్‌కు అవినాభావ సంబంధముందని అన్నారు. నిర్బంధాలు, బెదిరింపులను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడి ఆటపాటలతో పోరాడిన చిరస్మరణీయుడని కొనియాడారు. పాట ఉన్నంతకాలం గద్దర్ ప్రజల హృదయాల్లో చిరకాలం ఉంటాడని అన్నారు. ఆయన ఆశయాలకనుగుణంగా తెలంగాణలో పరిపాలన లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచారని తెలిపారు. రాహుల్‌గాంధీ సమక్షంలో గజ్వేల్ నుంచి పోటీ చేస్తానని తన మనసులో మాటను చెప్పారని, ఆ కల నెరవేరకుండానే మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మొనగారి రాజు, మల్లారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే రామకోటి భక్తసమాజ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ప్రజాయుద్ధనౌక గద్దర్ రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు. అలాగే డెమొక్రటిక్ అడ్వకేట్ ఫోరం ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రిమ్మనగూడ వద్ద గుంతలకు మరమ్మతులు

గుంతల పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్

గజ్వేల్: వర్షాలకు దెబ్బతిన్న రాజీవ్‌రహదారి దుస్థితిపై జులై 28న 'అడుగుకో గుంత' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. రహదారిపై ఏర్పడిన గుంతల మరమ్మతులు చేపట్టారు. గ్యాస్ పైప్‌లైన్ పనుల కారణంగా దెబ్బతిన్న రాజీవ్‌రహదారి సర్వీసు రోడ్లను సైతం బాగుచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

'ప్రైవేట్' హక్కులు కాపాడుతాం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం

ట్రస్మా అధ్యక్షుడు శేఖర్‌రావు

కొండపాక(గజ్వేల్): ప్రైవేటు పాఠశాలల హక్కులకు విఘాతం కలగకుండా ట్రస్మా యూనియన్ అండగా ఉంటుందని రాష్ట్ర అధ్యక్షులు శేఖర్‌రావు భరోసానిచ్చారు. కుకునూరుపల్లి మండలం మాత్‌పల్లి గ్రామశివారులోని హిడెన్ క్యాస్టల్ రిసార్టులో సోమవారం జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శేఖర్‌రావు మాట్లాడుతూ కరోనా కష్ట సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 5000 పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలను విద్యార్థి సంఘాలు ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. చిన్నపిల్లల స్కూల్ బస్సుల్లో సీట్ల కెపాసిటీకి అదనంగా 25మందికి పర్మిషన్ ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. అంతకుముందు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా సోమేశ్వర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో ట్రస్మా భవన నిర్మాణానికి సొంత ఖర్చుతో స్థలం కొనుగోలు చేసి ఇస్తానని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం ప్రైవేటు పాఠశాలల ఉనికి కాపాడేందుకు ఐక్యంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

సంక్షేమంపై దూకుడు

- ప్రతిష్టాత్మక పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి
- ఎన్నికలు దగ్గర పడుతుండటంతో వేగం పెంచిన అధికార యంత్రాంగం
- ఎప్పటికప్పుడు కలెక్టర్ సమీక్షలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లా అధికార యంత్రాంగం సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతిష్టాత్మక పథకాలను వీలైనంత త్వరగా లబ్ధిదారుల చెంతకు చేరేలా చర్యలు చేపట్టింది. ప్రధానంగా గొర్రెల పంపిణీ, దళితబంధు వంటి పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో తొలి విడతలో 18,754 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. అయితే రెండో విడతలో 10,331 మందికి ఈ యూనిట్లను అందించాల్సి ఉండగా, ఈ పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా ఈ యూనిట్లను పంపిణీ ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, గొర్రెలు కొనుగోళ్లు ఆలస్యం కావడంతో ఈ పంపిణీ ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రొక్యూర్‌మెంట్ టీంలు గొర్రెలను కొనుగోలు చేసేందుకు ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పటికీ వాటిని ఇక్కడికి తేవడంలో జాప్యం జరుగుతోంది. దీంతో సుమారు 10 వేల యూనిట్లు పంపిణీ చేయాలని భావించినప్పటికీ ఇప్పటి వరకు కేవలం 342 యూనిట్లు మాత్రమే పంపిణీ చేయగలిగారు. ఇటీవల జిల్లా కేంద్రంలో కొందరు లబ్ధిదారులకు ఈ యూనిట్లకు సంబంధించిన గొర్రెలను ఇచ్చారు.

దళితబంధు జాబితా వెరిఫికేషన్

ప్రతిష్టాత్మక పథకాల్లో ప్రధానమైన దళితబంధు పథకం రెండో విడత అమలు ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చిన లబ్ధిదారుల జాబితాను అధికారులు వెరిఫికేషన్ చేస్తున్నారు. తొలి విడతలో నియోజకవర్గానికి వంద చొప్పున దళితబంధు లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ యూనిట్లు ఇప్పటికే గ్రౌండింగ్ పూర్తయింది. అయితే తొలి విడతలో నియోజకవర్గానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సాచ్యూరేషన్ పద్ధతిన ఆ గ్రామంలోని దళితులందరికి ఈ పథకం కింద యూనిట్లను మంజూరు చేసిన విషయం విదితమే. ఇప్పుడు నియోజకవర్గానికి 1,100 చొప్పున యూనిట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల నుంచి లబ్ధిదారుల జాబితాలను అందజేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నుంచి లబ్ధిదారుల జాబితాలు కలెక్టరేట్‌కు రాగా, ఒక్క జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ఈ జాబితా రావాల్సి ఉంది. రెండు, మూడు రోజుల్లో ఇది కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలు మెదక్ జిల్లా పరిధిలో ఉండటంతో ఆయా మండలాల జాబితాలు మెదక్ జిల్లా కలెక్టరేట్‌కు పంపుతున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే దళితబంధు యూనిట్లను మంజూరు చేసేందుకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

క్లుప్తంగా

జిల్లా ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్

హుస్నాబాద్: జిల్లా ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన బుర్ర రాజేందర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా జనరల్ బాడీ సమావేశం సోమవారం సిద్దిపేటలో నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల ఆఫీసర్‌గా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు వ్యవహరించారు.

హుబ్లీ మార్కెట్ యార్డు సందర్శన


హుబ్లీ మార్కెట్ యార్డును సందర్శించిన మార్కెట్ పాలకవర్గ సభ్యులు, అధికారులు

హుస్నాబాద్: స్టడీ టూర్‌లో భాగంగా కర్ణాటకలోని హుబ్లీ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, అధికారులు సందర్శించారు. హుబ్లీ మార్కెట్ యార్డ్ నిర్వహణ, రైతులకు అందిస్తున్న గిట్టుబాటు ధరలు, క్రయవిక్రయాలు, సౌకర్యాలు, ఆదాయ మార్గాలను సమకూర్చుకోవడం వంటి అంశాలపై అధ్యయనం చేశారు. అక్కడి మార్కెట్ యార్డులో రైతులకు అందించే సేవలు, ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, మార్కెట్ అభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల పాత్రపై క్షుణంగా అధ్యయనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ రజని తిరుపతిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ రజిత, మార్కెట్ కార్యదర్శి సుజన్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరుటౌన్ : గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన అమీన్‌పూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కిష్టారెడ్డిపేట గ్రామశివారులోని వాగులో గుర్తుతెలియని మహిళ (35) మృతదేహాన్ని గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని బయటికి తీయించారు. పంచనామా నిర్వహించగా మృతురాలి చేతిపై హిందీలో ఓం అని రాసి ఉంది. చనిపోయి సుమారు 10 రోజులై ఉండొచ్చని, మృతదేహం కుళ్లిన స్థితిని బట్టి పోలీసులు భావిస్తున్నారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల రద్దుకు కుట్ర


నివాళులు అర్పిస్తున్న సంఘం నాయకులు

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం కామన్ సివిల్‌కోడ్ తెచ్చి రాజ్యాంగ హక్కులను రద్దు చేసేందుకు కుట్ర పన్నుతోందని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్ రాథోడ్ ఆరోపించారు. ఈ కుట్రను వ్యతిరేకిస్తూ రాష్ట్రీయ ఆదివాసీ ఏకతా పరిషత్ సోమవారం భారత్ బంద్ పిలుపులో భాగంగా సోమవారం ఎల్‌పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో ఖేడ్ అంబేడ్కర్ చౌక్‌లోని ఆయన విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కామన్ సివిల్ కోడ్ ద్వారా రాజ్యాంగం ద్వారా కల్పించిన ఎస్టీ గుర్తింపును రద్దు చేసి హక్కులు, అధికారాలను హరించాలని యత్నిస్తోందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, ఉపాధ్యక్షుడు రమావత్ సురేష్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, వినోద్‌నాయక్, రవినాయక్, వంశీ, విఠల్, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

దోష నివారణ చేస్తానని టోకరా

- బంగారంతో నిందితుడి ఉడాయింపు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- చేర్యాలలో ఉదంతం

చేర్యాల(సిద్దిపేట): ఇంటికి దోష నివారణ పూజ చేస్తానని యజమానులకు టోకరా వేసి బంగారంతో ఉడాయించాడు ఓ ప్రబుద్ధుడు. ఈ ఘటన అంబేద్కర్‌నగర్‌లో సోమవారం వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్టి ముత్తగల్ల భూమవ్వ పెద్ద కుమారుడు బాబు గడ్ల వ్యాపారస్తుడి వద్ద డ్రైవర్. గతేడాది మొహర్రం పండగ రోజు అతను విజయవాడకు చెందిన షేక్ మస్తాన్‌ను ఇంటికొచ్చాడు. గృహానికి దోషం ఉందని నివారణకు పూజ చేయాలంటే తిరస్కరించారు. తాజాగా బాధితురాలి చిన్న కుమారుడైన మధుతో మస్తాన్ సోషల్ మీడియాలో చాటింగ్ చేసి నంబర్ తీసుకున్నాడు. ఆదివారం సాయంత్రం విజయవాడ నుంచి వచ్చి, పూజ చేస్తున్నాడు. మధ్యలో అమ్మవారి అలంకరణకు బంగారు నగలు కోరాడు. 2.5 తులాల పుస్తెల తాడు, పావు తులం కమ్మలు, 5 తులాల వెండి పట్టీలు ఇచ్చారు. ఈ తంతు ముగిసిన అనంతరం సామగ్రిని సిద్దిపేట ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఓ ప్రాంతంలో పడవేయాలని చెప్పగా మధు వెళ్లాడు. పొద్దు పోయే వరకు రాలేదు కాల్ చేయగా తనను గుడి వద్ద ఉండమని చెప్పి మస్తాన్ వెళ్లాడు. తర్వాత కుటుంబీకులు అనుమానం వచ్చి గదిలో వెళ్లి చూస్తే బంగారం నగలు లేవు. తాము మోసపోయామని గ్రహించిన పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఆ మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నాచగిరి ఆలయ ఈఓగా అన్నపూర్ణ


అన్నపూర్ణ

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయ ఈఓగా ఎస్. అన్నపూర్ణ నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కట్టా సుధాకర్‌రెడ్డి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయానికి బదిలీ అయ్యారు. అక్కడి నుంచి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, యాత్రికుల సౌకర్యాలే లక్ష్యంగా అన్నివర్గాల సహకారంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

దుబ్బాకలోనే కోర్టు భవనం

తెలంగాణ ప్రభుత్వ పంచాయతీరాజ్ స్టాండింగ్ కౌన్సిల్ (హైకోర్టు) ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాకలోనే కోర్టు భవన నిర్మాణం జరుగుతుందని తెలంగాణ పంచాయతీరాజ్ స్టాండింగ్ కౌన్సిల్ హైకోర్టు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి(ఆర్‌సీఆర్) అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఆయన మాట్లాడారు. కోర్టు వ్యవహారం రాజకీయాలతో సంబంధం ఉండదని, అనవసరంగా దీనిపై ఎమ్మెల్యే రఘునందన్ రావు, కాంగ్రెస్ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. తిమ్మాపూర్‌లో కోర్టు నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అసెంబ్లీలో ప్రస్తావించడం సరికాదన్నారు. కోర్టు ఏర్పాటు అన్నది హైకోర్టు, జిల్లా కోర్టుల జడ్జిల ఆధీనంలో ఉంటుందని తెలిపారు. దుబ్బాకలో గతంలో చూపించిన స్థలంలోనే కోర్టు భవన నిర్మాణం జరుగుతుందని ప్రజలు ప్రతిపక్షాల నాటకాలు నమ్మొద్దన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షులు, న్యాయవాది పల్లె వంశీకృష్ణాగౌడ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలు బంద్ చేస్తాం

సిద్దిపేటఅర్బన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అత్యవసర సేవలు బంద్ చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ హెచ్చరించారు. సోమవారం కార్మికులు పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుంచి రంగదాంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 33 రోజులుగా సమ్మె చేస్తున్నా అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం సరికాదన్నారు.

మూడోరోజు 15 దరఖాస్తులు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని మద్యం దుకాణాలకు లైసెన్సులు పొందేందుకు మూడోరోజు సోమవారం 15 దరఖాస్తులు వచ్చినట్లు సిద్దిపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి తెలిపారు. సిద్దిపేట సర్కిల్‌లో 1, గజ్వేల్ సర్కిల్‌లో 11, హుస్నాబాద్ సర్కిల్‌లో మూడు దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు మొత్తం 19 దరఖాస్తులు వచ్చాయన్నారు.

మిట్టపల్లి రైతుల నిరసన

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లి నుంచి బొగ్గులోని బండకు వెళ్లే తారు రోడ్డుపై మిట్టపల్లికి చెందిన రైతులు సోమవారం ముళ్లపొదలు రోడ్డుకు అడ్డంగా వేసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, గ్రామానికి చెందిన సుమారు 15 మంది రైతులకు చెందిన పట్టాభూమి సుమారు 32 గుంటలు తారు రోడ్డు కోసం సేకరించారన్నారు. గతంలో నక్ష ప్రకారం రోడ్డు వేయాలని తమ పట్టా భూమిని రోడ్డులో కలపకూడదని అడ్డుకున్నామన్నారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలగజేసుకొని నక్ష ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమి 32 గుంటలు.. 15 కుటుంబాలకు పట్టా చేస్తామని చెప్పి సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

చేప పిల్లలు మృత్యువాత

- పరిశ్రమల కలుషిత నీరే కారణమంటున్న పెంపకందారులు


ఆందోళన వ్యక్తం చేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్) : నవాబుపేటలోని సాంబయ్య చెరువులోకి కలుషితమైన కెమికల్ వ్యర్థాలతో చేప పిల్లలు మృత్యువాత పడ్డాయని సోమవారం పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు నీటిలో కెమికల్ వ్యర్థాలు కలిసి నష్టం వాటిల్లిందని ఇంద్రేష్, మల్లేష్, రవి, యాదగిరి, రాజు, కృష్ణ ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాలని రామచంద్రపురంలోని పీసీబీ కార్యాయలంలో ఫిర్యాదు చేశారు. గతంలో 50 వేల చేపపిల్లలను చెరువులో వదిలామన్నారు.

వివాహిత ఆత్మహత్య

పటాన్‌చెరుటౌన్: ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం...పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎస్.కె హర్దాన్, ఇద్దరు భార్యలు మీతూ సర్దార్, సుహానాతో కలిసి నందిగామలో నివాసం ఉంటూ, ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రెండో భార్య మీతూ సర్దార్(34) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అణు విజ్ఞానంతో సరికొత్త అభివృద్ధి


నవోదయ విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

- బార్క్‌యువ శాస్త్రవేత్తలు

వర్గల్(గజ్వేల్): దేశ, విదేశాల్లో ఇప్పటికే అణు విజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయ, వైద్య రంగాలలో సరికొత్త అభివృద్ధి సాధించారని బార్క్(బాబా అటామిక్ రిసెర్చ్‌సెంటర్) యువ శాస్త్రవేత్తలు డాక్టర్ అభిజిత్ సాహ, డాక్టర్ జ్యోత్స్న భట్ అన్నారు. అణు విజ్ఞానం కేవలం విధ్వంసానికే పరిమితమనే అపోహ విడాలని, శాంతిస్థాపనకు, వైద్య, వ్యవసాయ రంగాల పురోగతికి కూడా ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. భారత పరమాణు శక్తిని విద్యార్థులకు పరిచయం చేసి వారు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన ప్రేరణ కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బార్క్‌తో అనుసంధానమై పరమాణు జ్యోతి కార్యక్రమాన్ని నవోదయ విద్యాలయాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించిందన్నారు. సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించిన శాస్త్రవేత్తలకు ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్‌ప్రిన్సిపాల్ సత్యవతి బృందం సాదర స్వాగతం పలికారు. అనంతరం విద్యాలయ మల్టీపర్పస్ హాల్‌లో విద్యార్థులతో సమావేశమై పరమాణు విజ్ఞానంపై ఆసక్తి పెంపొందింపజేసేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. క్విజ్ పోటీ నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ఆన్‌లైన్ ద్వారా బార్క్ డైరెక్టర్ అజిత్ కుమార్ మహంతిని విద్యార్థులకు పరిచయం చేశారు. రాబోయే కాలంలో పరమాణు విజ్ఞానం ఎన్నో సౌకర్యాలకు ఊతంగా ప్రజలకు అత్యంత చేరువై, నిత్య జీవితంలో భాగంగా మారనుందన్నారు. నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఓ వరం

- తెలుగురాష్ట్రాల్లో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు
- జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నంగనూరు, హుస్నాబాద్: రెగ్యులర్‌గా చదవలేని వారికి ఓపెన్ స్కూల్ ఓ వరమని జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం అడ్మిషన్ సమోదు డ్రైవ్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ, పెద్దవాళ్లకు, మధ్యలో చదువు మానేసిన వారికి, ఉద్యోగం చేస్తూ ప్రమోషన్ పొందాలనుకునే వారికి, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే వారికి, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస 10వ తరగతి, ఇంటర్ పాస్ కావాలని కోరుకునే వారికి ఒక మంచి అవకాశం ఉన్నారు. ఏదొక పని చేసుకుంటూ సెలవు రోజుల్లో మాత్రమే ఓపెన్ స్టడీ సెంటర్‌కు వచ్చి క్లాసులో విని ఇంట్లో కూర్చోని చదువుకుంటే సరిపోతోందన్నారు. ఓపెన్ 10వ తరగతి, ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ 10వ తరగతి, ఓపెన్ ఇంటర్ చేయడానికి అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వారే కాకుండా తెలుగు రాష్ట్రాల్లోని వాళ్లు ఎవరైన దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, కో ఆర్డినేటర్ బండారి మనీల, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పంజా రాజమల్లు, మండల నోడల్ ఆఫీసర్ శంకర్ నాయక్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయోగ్నస్టిక్ పరీక్ష బహిష్కరిస్తాం

- సమ్మెకు దిగుతాం : ల్యాబ్ టెక్నీషియన్లు


వినతి అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఎంలు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ డయోగ్నస్టిక్ ఆన్‌లైన్.. పరీక్షలను బహిష్కరిస్తామని ల్యాబ్ టెక్నీషియన్లు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో పనిచేస్తున్న తమ సేవలను గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్‌తో పాటు గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో సుమారు 620 మంది ల్యాబ్ టెక్నీషియన్లు డీఎస్సీ ద్వారా ఎంపికై 22 ఏళ్లుగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి వైద్యుల మాదిరిగానే వెయిటేజ్ మార్కులిచ్చి క్రమబద్ధీకరించాలని, హెల్త్ కార్డులు లేదా హెల్త్ ఇన్సూరెన్స్, సమాన పనికి సమాన వేతనం, పీఆర్సీ పేస్కేల్ వర్తింపజేయాలని, కారుణ్య నియామకాలతో పాటు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి సెలవులు ఇప్పించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని కొండాపూర్‌లో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన గుండం వెంకటమ్మ వెంకట్రాంరెడ్డి దంపతుల ఇంట్లో విద్యుత్ షారట్ సర్క్యూట్‌లో మంటలు చెలరేగాయి. స్థానికులు సిద్దిపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సకాలంలో సిబ్బంది చేరుకొని చుట్టు పక్కల మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పెంకుటిల్లు పైకప్పుతోపాటు వస్తువులు, దుస్తులు, బియ్యం కాలి బూడిదయ్యాయి. సుమారు రూ. లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో 3 రోజుల నుంచి జరిగిన పలు సైబర్ నేరాల వివరాలు తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. బెజ్జంకి స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తన బ్యాంక్ ఖాతాకు ఫోన్ నంబర్ లింకు చేయాలన్నాడు. బాధితుడు తన ఫోన్ లింకును ఓపెన్ చేసి ఓటీపీ వివరాలు నమోదు చేశాడు. అంతే ఖాతా నుంచి రూ.47,200 డెబిట్ అయినట్లు మెసెజ్ వచ్చింది. అలాగే కుకునూర్ పల్లి స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ఓ యాప్ ద్వారా లోన్ తీసుకుని తిరిగి మొత్తం చెల్లించాడు. కానీ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఇంకా డబ్బులు చెల్లించాలని లేకుంటే ఫొటోలు న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. భయపడిన బాధితుడు రూ.5వేలు పంపించాడు. కాగా సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి ఆన్‌లైన్ యాప్ ద్వారా లోన్ మంజూరైందని గుర్తు తెలియని వ్యక్తి లింక్ పంపించాడు. ఆ లింకును ఇన్‌స్టాల్ చేయగానే బాధితుడి ఖాతా నుంచి రూ.5వేలు డెబిట్ అయినట్లు మెసెజ్ వచ్చింది. తర్వాత గుర్తుతెలియని వ్యక్తికి కాల్‌చేయగా ఫొటోలు మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. పలు కేసుల్లోని బాధితులు జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారని సీపీ తెలిపారు.

'డబుల్' ఇళ్లు ఐదు శాతం కేటాయించాలి

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో తమకు 5 శాతం కేటాయించడంతోపాటు గృహలక్ష్మిలో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ శరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడారు. జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లోని ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాక్ పోస్టులు గుర్తించాలన్నారు. స్వయం ఉపాధి కోసం ఎలాంటి షూరిటీ లేకుండా రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై జిల్లా అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇస్మాయిల్, జయలక్ష్మి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం ఉపాధ్యక్షుడు పోచయ్య, ప్రకాష్‌రావు, సంగమేశ్వర్, లక్ష్మి, సత్యనారాయణ, దివ్యాంగులు పాల్గొన్నారు.

విషం తాగి వ్యక్తి మృతి

కొల్చారం(నర్సాపూర్): కుటుంబ కలహాల కారణంగా విషం తాగిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లి గిరిజన తండాలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాలు.. పోతిరెడ్డిపల్లి గిరిజన తండాకు చెందిన కోల శ్రీనివాస్ (30) కూలి పని పనిచేసుకునేవాడు. ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తలు తరచుగా గొడవపడేవారు. ఈ క్రమంలో ఈనెల 4న భార్య రజితతో గొడవ పడి ఇంటి పక్కనున్న పొలానికి వెళ్లి వస్తానన్నాడు. తర్వాత అతడిని అపస్మారక స్థితిలో ఉండటాన్ని భర్య గమనించింది. పక్కనే పురుగులమందు డబ్బా పడి ఉంది. చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న అతడు ఆదివారం రాత్రి మృతిచెందాడు.

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్

- రాష్ట్ర అధ్యక్షుడు మల్‌శెట్టి డిమాండ్


నియామక పత్రాన్ని అందజేస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వం కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి డిమాండ్ చేశారు. రానున్న 2023 సాధారణ ఎన్నికల్లో కురుమ వర్గానికి 12 ఎమ్మెల్యేలతోపాటు 2 ఎంపీ, 4 ఎమ్మెల్సీ స్థానాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలో ఉన్న మల్కాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా మండలలాలకు, తాలుకాలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం వారికి, మల్‌శెట్టి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కురుమ గొర్రె, మేకల పెంపకం దారులకు రూ. 5వేలు పెన్షన్ మంజూరు చేయడంతోపాటు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి గ్రామ సొసైటీకి జీఓ 559ను అమలు చేస్తూ 5 ఎకరాల భూమిని మంజూరు చేయాలని చెప్పారు. గతంలో ఎన్‌సీడీసీ పథకం ద్వారా గొర్రెల యూనిట్‌కు పావలా వడ్డీ కింద తీసుకున్న లక్ష రూపాయలను పూర్తిగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కురుమల ఆరాధ్య దైవం బీరప్ప మందిరాల వద్ద సేవలందిస్తున్న పూజారులకు దూప దీప నైవేద్యం పథకం ద్వారా జీతభత్యాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు గోవింద్, ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు అరుదైన ఆపరేషన్

- కాలులోని 3 కిలోల కణితి తొలగింపు




కణితిని తొలగించిన వైద్యబృందం

దుబ్బాకటౌన్ : మహిళకు అరుదైన ఆపరేషన్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. సోమవారం వైద్యులు ఆమె కాలు నుంచి 3 కిలోల కణితిని తొలగించారు. సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తికి చెందిన పోతి రాజవ్వ కాలి కణితి గడ్డ తొలగించడానికి రూ.50 వేలకుపైగా ఖర్చు అవుతుందని పలు ప్రైవేట్ ఆస్పత్రుల వారు తెలిపారు. ఆర్థిక స్థోమత లేని కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించారు. బాధితురాలికి వైద్యులు భరోసానిచ్చి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా కణితిని తొలగించారు. కాగా ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. వైద్యులకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతున్న..


బ్రహ్మం

హవేళీఘనపూర్ : ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బూర్గుపల్లిలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన బ్రహ్మం(56) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబీకులు మెదక్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో తరలించగా, అక్కడ మృతి చెందాడు. కేసును ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నారు.

ఇంద్రధనుష్‌పై విస్తృత ప్రచారం చేయండి


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారి

- జిల్లా ఇమ్యునైజేసన్ అధికారి శశాంక్ దేశ్‌పాండే

కోహీర్(జహీరాబాద్): ఇంద్రధనుష్‌పై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శశాంక్ దేశ్‌పాండే అన్నారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పీచేర్యాగడిలో నిర్వహించిన ఇమ్యునైజేషన్ కేంద్రాన్ని సందర్శించి, ఇమ్యునైజేషన్ సరళిని పరిశీలించారు. టీకా మందు ప్రయోజనాలు ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ టీకాలు అందించడానికి అవసరమయ్యే చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు.